క్లుప్తంగా

నేడు కాచిగూడ బస్‌స్టాండ్‌లో రక్తదాన శిబిరం

కాచిగూడ: ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఈనెల 27న ఉదయం 9:30 గంటలకు కాచిగూడ బస్‌స్టాండ్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ కాచిగూడ డిపో మేనేజర్ రవీందర్‌రెడ్డి ప్రకటించారు. కాచిగూడ, బర్కత్‌పుర డిపోలకు చెందిన ఉద్యోగులు, సిబ్బందితో పాటు యువత పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని కోరారు.

అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాలకృష్ణ


బడుగుల బాలకృష్ణమాదిగను సత్కరిస్తున్న బస్తీవాసులు

అంబర్‌పేట: గోల్నాక డివిజన్ అంబేడ్కర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బడుగుల బాలకృష్ణమదిగ ఎన్నికయ్యారు. సోమవారం బస్తీలో జరిగిన సమావేశంలో బాలకృష్ణతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఆకునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్, కోశాధికారిగా ఎస్.యాదగిరి, కార్యదర్శులుగా శివకుమార్, ఎస్.శివకుమార్, కార్యనిర్వహాక కార్యదర్శిగా రవి, కె.రాజు, ఎస్.బాలకృష్ణలు ఎన్నికయ్యారు.

అల్పాహారం పంపిణీ

నల్లకుంట: ముత్యాల విజయ్ ఆధ్వర్యంలో నల్లకుంట డివిజన్ టీఆర్టీ కాలనీలోని స్ఫూర్తి బాయ్స్ హోం (అనాథ విద్యార్థుల వసతి గృహం)లో విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ప్రవీణ్, రాచర్ల భాస్కర్, సత్యనారాయణ, భానుప్రకాష్, విజయ్, జాఫర్, ధన్‌రాజ్, పరమేష్ తదితరులున్నారు.

మేదరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీధర్



కాచిగూడ: తెలంగాణ మేదరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జొర్రిగల శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయనకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ నియామకపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం శ్రీధర్ తెలుగు బీసీ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

ఇంటింటికీ ఓటరు నమోదు


ఓటు నమోదు చేయిస్తున్న డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ రిసాలఖుర్షిద్‌లో 18 ఏళ్లు నిండిన యువతీయువకులను గుర్తించి ఓటరులిస్టులో పేరులేని వారిని గుర్తించి కొత్తగా ఓటరుగా నమోదు చేసే కార్యక్రమానికి రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు శ్రీకారం చుట్టారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్, డివిజన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఆలందార్ హుస్సేన్, సయ్యద్ ముక్తార్ హుస్సేన్, ముదిగొండ మురళీ, శ్రావణ్, రమేష్‌యాదవ్, సునీల్ ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభినందన

అంబర్‌పేట: తెలంగాణ మేదర సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఎన్నికైన కె.మురళి కృష్ణను తెలంగాణ బీసీ జాగృతి సంస్థ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సోమవారం అలీకేఫ్ చౌరస్తాలోని మేదర సంఘం ఫంక్షన్‌హాల్‌లో మురళికృష్ణకు శాలువ కప్పి అభినందించారు. మాజీ కార్పొరేటర్ పులిజగన్, బీసీ జాగృతి నాయకులు బాల్‌రాజ్, రాములు, కిషన్ తదితరులున్నారు.

ఆర్.కృష్ణయ్యకు అండగా ఉంటాం

కాచిగూడ: బీసీ ఉద్యమనేత, వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఎంపీగా ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు సోమవారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భూపేష్‌సాగర్, నందగోపాల్, రాము, ఉదయ్, శివకుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

అంబర్‌పేట: తురుమ్‌ఖాన్ సినిమా పోస్టర్ ఆవిష్కరణ సందడిగా జరిగింది. సోమవారం అంబర్‌పేటలో ప్రముఖ సంఘసేవకులు అంబర్‌పేట శంకర్ నివాసంలో చిత్ర యూనిట్ సభ్యులు శంకర్‌తో పోస్టర్‌ను ఆవిష్కరింపజేశారు. సినిమా నిర్మాత ఆసిఫ్‌జాని, దర్శకుడు శివకల్యాణ్, చిత్ర బృందం పీఎం సుధాకర్, లలిత్, శివ, కిరణ్, ప్రవీణ్, సోహెల్ తదితరులున్నారు.

విద్యార్థుల వరుస ఆత్మహత్యలను అరికట్టాలి

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన ఆప్ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్


మాట్లాడుతున్న ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ: బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ట్రిపుల్ ఐటీ, కార్పొరేట్ కాలేజీల విద్యార్థుల వరుస ఆత్మహత్యలను వెంటనే అరికట్టాలని ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా మానసిక నిపుణులచే కౌన్సిలింగ్ ఇప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం దోమలగూడ లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. భవిష్యత్తు గురించి అందమైన కళలుకని ఐఐఐటీలో చేరిన విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు చేసుకోవడం కలచివేస్తోందన్నారు.

- విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యను అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.
- విద్యా ప్రక్షాళన, పరీక్షా విధానం, ఒత్తిడి తగ్గించడం వంటి విషయాలతో పాటు నీరజ కమిటీ నివేదికను అమలు చేయాలన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.
- ప్రతి కళాశాలలో విద్యార్థులకు మానసిక నిపుణులతో కౌన్సిలింగ్ ఇప్పించాలన్నారు.
- ఐఐఐటీ యాజమాన్యం విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా కేవలం అధికంగా ఒత్తిడి చేయడం వల్లే విద్యార్థులు భయాందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు.
- విద్యార్థుల ఆత్మహత్యలను ఆపాలని కనీస వసతులు కల్పించాలని కోరుతూ.. ఈ నెల 28న ఆప్ ఆధ్వర్యంలో 'ఛలో ట్రిపుల్ ఐటీ ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రకటించారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, డాక్టర్ సాల్మన్‌రాజ్, అధికార ప్రతినిధి ప్రవీణ్‌గౌడ్, పరీక్షిత్‌రాజ్, రాజేష్‌సింగ్, ఎండీ మొబిన్, తేజ, సోహెల్ తదితరులున్నారు.

రైతుల హామీలను నెరవేర్చాలని దశల వారీగా ఆందోళనలు


సంయుక్త కిసాన్ మోర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న సాగర్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఆందోళన చేపడుతున్నట్లు కిసాన్ మోర్చా సంయుక్త రాష్ట్ర నాయకులు టి.సాగర్, మురళిరెడ్డి, వేములపల్లి వెంకటరామయ్య, రాయల చంద్రశేఖర్‌లు స్పష్టం చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కనీస మద్దతు ధరల చట్టం, విద్యుత్ సవరణ బిల్లు, పంటల బీమా పథక సవరణపై కేంద్రం ఇచ్చిన హామీలను పక్కన పెట్టిందని విమర్శించారు. పంటల కొనుగోలు బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తప్పుకునేందుకు కుట్రలు చేస్తుందన్నారు. నాయకులు మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్య, యాదగిరి, గుమ్మడి నర్సయ్య, ప్రభాకర్, గోవర్ధన్, మండల వెంకన్న తదితరులున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

చిక్కడపల్లి: భారత 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీ నగరంలో ఆగస్టు 22న జాతీయ నంది, ప్రైడ్ ఇండియా నేషనల్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు శిఖరం ఆర్ట్ థియేటర్స్ వ్యవస్థాపక కార్యదర్శి కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. సంఘసేవ, విద్య వాణిజ్య, కళ, క్రీడ, సంగీతం, నృత్యం, సాహిత్యం, ఉద్యోగ, సినీ, టీవీ, రాజకీయ, పారిశ్రామికరంగాల్లో కృషి చేస్తున్న వారు అర్చక, పురోహిత, వాస్తు, జ్యోతిష్య రంగాలవారు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఆసక్తి కలిగిన వారు జూలై 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9494523562 నంబరును సంప్రదించాలని కోరారు.

పోలీసులకు సత్కారం



ముషీరాబాద్: వారాసిగూడ నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటైన సందర్భంగా అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎస్సై ప్రకాష్‌రెడ్డి, సుధాకర్, సునీతలను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సయ్యద్ అస్లాం, వెంకటరామిరెడ్డి, శ్యామ్ సుందర్, కె.మాధవ్, రమేష్, శివానంద్‌గౌడ్, ప్రశాంత్ తదితరులున్నారు.

పెన్షనర్ల కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ధర్నా

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల పెన్షన్‌దారుల సంయుక్త కార్యచరణ సమితి ఆధ్వర్యంలో ఇందిరా పార్కులో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి చైర్మన్ లక్ష్మయ్య, జనరల్ సెక్రటరీ సుధాకర్‌లు మాట్లాడుతూ.. అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ స్కీమ్‌ను యూనివర్సిటీ, టీచర్స్, జీహెచ్ఎంసీ, మార్కెట్ కమిటీ సంస్థల పెన్షనర్లకు కూడా వర్తింపజేయాలన్నారు. పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల భవన నిర్మాణం, పెన్షనర్ల కార్యాలయ నిర్వహణ, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు నగరంలో వేయి చదరపు గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు చెల్లించే కమ్యూటేషన్ విలువ తిరిగి చెల్లించే కాలాన్ని 15 ఏళ్లకు బదులు 12 ఏళ్లకు కుదించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో కనీసం రెండు వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి డాక్టర్లు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇచ్చి గౌరవించి గుర్తించాలన్నారు.

లింబాద్రికి టీపీటీఎల్ఎఫ్ వినతి


వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎల్ఎఫ్ ప్రతినిధులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యూనివర్సిటీల అనుమతి లేకుండానే విద్యా సంస్థలు రిక్రూట్‌మెంట్ చేసుకున్న ఫాకల్టీని తీసివేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ.. సోమవారం తెలంగాణ ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు సిద్ధార్థ్ తదితరులున్నారు.

వ్యర్థాలను తొలగించండి

కాచిగూడ: ఓవైపు వర్షాలు పడుతున్నా.. మరోవైపు మ్యాన్‌హోల్స్‌లో పేరుకుపోయిన పూడికతీత పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అన్నారు. సోమవారం కాచిగూడ, నింబోలిఅడ్డలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కచ్చామోరీల్లో నుంచి సీల్ట్‌ను తీసి రోడ్లపై వేసి అధికారులు, కాంట్రాక్టర్లు వదిలేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. రోడ్లపై వదిలేసిన వ్యర్థాలు తిరిగి వర్షం పడితే కచ్చామోరీల్లో చేరుతోందని దీన్ని శుభ్రం చేసేందుకు ప్రజాధనం వృథా అవుతోందన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ తమ విధులను సక్రమంగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రోడ్లపై వేసిన సిల్ట్‌ను వెంటనే తొలగించే విధంగా కాంట్రాక్టర్‌ను అధికారులు ఆదేశించాలని లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. బీజేపీ నేతలు శ్రీకాంత్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్, దినేష్‌బాబు తదితరులున్నారు.

పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలి

అంబర్‌పేట: పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా విధులు నిర్వహించాలని పారిశుద్ధ్య కార్మికులకు బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం డివిజన్‌లో పారిశుద్ధ్య సమస్యపై జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది, కార్మికులతో ఆమె క్షేత్రస్థాయిలో సమావేశం నిర్వహించారు. కార్మికులు శుభ్రం చేసిన చెత్తను రిక్షాల నుంచి తరలించే క్రమంలో ఇబ్బందులు తలెత్తున్నాయని దీనిని అధిగమించేందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. ఇంటింటికి స్వచ్ఛ ఆటోకార్మికులు వెళ్లి చెత్త సేకరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది ఆదిల్, శ్రీనివాస్ తదితరులున్నారు.


కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్


పారిశుద్ధ్య కార్మికులతో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

నిజమైన కార్మిక యోధుడు డీ.వీ కృష్ణ


'వ్యాసాల సంకలనం నిరంతర అన్వేషకుడు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసిన నిజమైన కార్మిక యోధుడు డీ.వీ.కృష్ణ అని సీనియర్ జర్నలిస్టు సతీష్‌చందర్ అన్నారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రజాపంథా మార్గ నిర్దేశకుడు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.వి.కృష్ణ ప్రథమ వర్ధంతి సభ జరిగింది. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే.జీ.రాంచంద్రన్, రాష్ట్ర కార్యదర్శి రంగారావు, దీప, రామకృష్ణారెడ్డి, సాయిరెడ్డి, రాష్ట్ర నాయకులు రంగారెడ్డి, చంద్రశేఖర్, రమా, అరుణ, ఎస్.ఎల్.పద్మ, సూర్యం, అన్వేష్ తదితరులున్నారు.

బీసీల ప్రాధాన్యత తగ్గించేందుకే కులగణనపై నిర్లక్ష్యం

కాచిగూడ: దేశంలో 54 శాతం ఉన్న బీసీల ప్రాధాన్యతను తగ్గించేందుకే కేంద్రం కులగణనకు వెనుకడుగు వేస్తోందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. బీసీ కులగణనను చేపట్టాలని అసెంబ్లీలో తీర్మానాలు చేసినా కేంద్రం స్పందించడం లేదన్నారు. సోమవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బీసీ కుల గణనకు మద్దతు ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేశంలోని 70 కోట్ల మంది బీసీల కోసం సంక్షేమ పథకాల అమలు, నిధుల కేటాయింపు, ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు కులగణన అవసరమని తెలిపారు.

'నాటా' మహాసభల్లో ఇంద్రజాల ప్రదర్శన

చిక్కడపల్లి: భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన ఇంద్రజాలికుడు మర్రి రమేష్ నెలరోజులపాటు అమెరికాలో పర్యటించనున్నారు. శంకర నేత్రాలయ(అమెరికా), నార్త్ అమెరికా తెలుగు సంఘం (నాటా) వారి ఆధ్వర్యంలో జరిగే తెలుగు మహాసభల్లో జూలై 1న మర్రి మాయాజాల్ ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ మహాసభలు డల్లాస్ నగరంలో టెక్సాస్‌లో ఈ నెల 30 నుంచి జూలై 2వ తేదీ వరకు జరుగుతాయని రమేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలో సీనియర్ ఇంజినీర్‌గా రమేష్ విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం తెలంగాణ మేజిక్ అకాడమీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని పలు నగరాల్లో కూడా మర్రి రమేష్ ప్రదర్శన ఇవ్వడం విశేషం. కాగా ఐదు దశాబ్దాలుగా మర్రి మాయాజాల్ పేరుతో వందలాది ప్రదర్శనలు ఇచ్చారు.

వ్యక్తి అదృశ్యం


నవీన్ (ఫైల్)

ముషీరాబాద్: ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లి అదృశ్యమైన ఘటన ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాకారం బొమ్మలగూడి వద్ద 1-7-423 ఇంట్లో నివసించే మచ్చనవీన్ (37) ఈనెల 16న నెరేడ్‌మెట్‌లోని కోర్టుకువెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. దీంతో ఆ రోజు సాయంత్రం, మరుసటి రోజు బంధువులు, స్నేహితులు ఇతర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య ఎం.సంతోషి సోమవారం ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ తెలిపారు.

ఆహ్వానం అందజేత

చిక్కడపల్లి: ఈనెల 30న చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించనున్న గ్రీన్ అవార్డ్స్ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సినిమా టీవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కూర్మాచలం ముఖ్య అతిథిగా హాజరవుతారని ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సంస్థ అధ్యక్షుడు ఎన్‌సీహెచ్ రంగయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం రంగయ్య ఏసీ గార్డ్స్‌లోని ఎఫ్‌డీసీ చైర్మన్ కార్యాలయంలో అనిల్ కూర్మాచలాన్ని కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి


మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న 'గ్రీన్ రిచ్ ఫ్రెండ్స్ అసోసియేషన్' ప్రతినిధులు

నల్లకుంట: ఉప్పల్ భగాయత్ వెస్ట్‌ఫేస్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని 'గ్రీన్ రిచ్ ఫ్రెండ్స్ అసోసియేషన్' ప్రతినిధుల బృందం మంత్రి కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉప్పల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కేటీర్‌ను అసోసియేషన్ ప్రతినిధుల బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. ఉప్పల్ వెస్ట్ భగాయత్‌లో చాలా కుటుంబాలు నివాసముంటున్నాయని అక్కడ నివసిస్తున్న ప్రజలకు కనీసం మౌలిక వసతులు కల్పించడంలో హెచ్ఎండీఏ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు. తాగునీటి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నల్లా కనెక్షన్‌లు మంజూరు చేయడం లేదన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ఎక్కడికక్కడ గుంతలమయంగా మారిన రోడ్లతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వీధిదీపాలు లేక రాత్రిపూట బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కాలనీలో సెక్యూరిటీ ఏర్పాటు చేయించాలని రోడ్ల పక్కన పేరుకుపోయిన వ్యర్థాలతో దుర్గంధం వెలువడుతోందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి హెచ్ఎండీఏ లేఅవుట్ కాలనీ తన దృష్టికి తీసుకురాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివప్రసాద్‌రావు, సంయుక్త కార్యదర్శి ఎన్. విష్ణువర్ధన్ రెడ్డి, కోశాధికారి రాంగోపాల్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మహేష్‌కుమార్, డి.శివకుమార్, వంశీ, గోవర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్, వై.శ్రీనివాస్‌రెడ్డి, అభినవ్ తదితరులున్నారు.

డీడీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్‌గా కృష్ణారెడ్డి



నల్లకుంట: తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ ఎస్. కృష్ణారెడ్డిని విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రి (డీడీహెచ్) మెడికల్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ మేనేజ్‌మెంట్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన కృష్ణారెడ్డి ప్రభుత్వ వైద్యుడిగా, కింగ్‌కోఠి ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా, అడిషనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించి 2007లో పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ మెంబర్, ఉస్మానియా అల్యుమ్నీ ట్రస్ట్ చైర్మన్‌తో పాటు పలు అడ్మినిస్ట్రేషన్ పదవుల్లో కొనసాగుతున్నారు. ఆయన సేవలను గుర్తించిన డీడీహెచ్ మేనేజ్‌మెంట్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా నియమించింది. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించిన సంఘ సంస్కర్త దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆశయ సాధనకు తనవంతు కృషి చేస్తానన్నారు. కృష్ణారెడ్డి నియామకంపై ఈ సందర్భంగా పలువురు వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

'అవినీతికి కేరాఫ్ బీఆర్ఎస్ ప్రభుత్వం'


గోల్నాకలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నేత డాక్టర్ ఎస్.గౌతంరావు

అంబర్‌పేట: అవినీతికి కేరాఫ్‌గా రాష్ట్ర ప్రభుత్వ పనితీరు ఉందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు ఆరోపించారు. బీజేపీ మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా సోమవారం గోల్నాక డివిజన్‌లో చేపట్టిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు మూల రవీందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, రవీందర్, వేణుగోపాల్, ఎస్.శ్రీనివాస్, గణేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.
– అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షులు నాగభూషణంచారి ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. బాపూనగర్‌లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు కొంక రవి, వెంకటస్వామి, నరేందర్, ప్రవీణ్, సాయి, తేజ తదితరులున్నారు.

మత్తుతో భవిష్యత్తు అంధకారం


ఉస్మానియా జనరల్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి

కాచిగూడ: యువత మత్తుకు బానిసలైతే భవిష్యత్తు అంధకారమవుతుందని క్రమశిక్షణతో మెలిగి కుటుంబ గౌరవాన్ని కాపాడుకోవాలని ఉస్మానియా ఆసుపత్రి జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో సోమవారం సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మత్తు పదార్థాలను బహిష్కరించి మత్తు రహిత సమాజాన్ని నిర్మించాలన్నారు. మాదకద్రవ్యాలను వాడటం వల్ల వచ్చే అనర్థాలు, నియంత్రణపై విద్యార్థులను జాగృతం చేశారు. ఓ సర్వే ప్రకారం దేశంలో ప్రతి ఆరుగురిలో ఒకరు మద్యానికి బానిస అవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ మానసిక నిపుణురాలు డాక్టర్ చిన్మయి తమ్మారెడ్డి, ప్రిన్సిపాల్ సంగయరాజా, సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ టిల్లా మురళిమోహన్, ఎస్ఆర్‌కె శాస్త్రి, శివకుమార్, రాజేందర్ ముదిరాజ్ తదితరులున్నారు.

వార్డు కార్యాలయానికి 24 ఫిర్యాదులు

చిక్కడపల్లి: గాంధీనగర్ వార్డు కార్యాలయ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై 24 ఫిర్యాదులు వచ్చాయని వార్డు కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ ఏఎంసీ ప్రవీణ్‌చంద్ర తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వార్డు కార్యాలయం ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల అధికారుల, సిబ్బంది మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్య అందుబాటులో ఉంటున్నారన్నారు. శానిటేషన్, చెట్లు కొమ్మల తొలగింపు, రోడ్లపై చెత్తాచెదారాలు, విద్యుత్ సమస్యలు, తాగునీటి సమస్యలపై 24 ఫిర్యాదులురాగా.. వాటిలో 15 పరిష్కరించామని మిగిలిన వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు కూడా సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు పరిశీలించేందుకు తాను కూడా స్వయంగా వెళ్తున్నట్లు ప్రవీణ్‌చంద్ర వివరించారు.

ఆలయ ఆవరణలో చెట్ల కొమ్మల తొలగింపు



ముషీరాబాద్: బోనాల సందర్భంగా నియోజకవర్గంలోని జెమిని కాలనీలోని పోచమ్మ దేవాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, యువ నాయకుడు ముఠా జైసింహకు ఆలయ కమిటీ సభ్యులు బోనాలు, ఫలహారం బండ్లు తీసుకురావడానికి చెట్లకొమ్మలు ఆటంకంగా ఉన్నాయని ఫిర్యాదుతో వెంటనే వారి ఆదేశాల మేరకు ఆర్ట్ కల్చర్ డిపార్ట్‌మెంట్‌కు చెప్పి కొమ్మలను తొలగింపజేశారు. అమ్మవారి దేవాలయానికి రంగులు, భక్తుల సౌకర్యార్థం ఇతర ఏర్పాట్లను చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాండ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పూస గోరఖ్‌నాథ్, దేవాలయ మాజీ చైర్మన్ కాడబోయిన లక్ష్మణ్, కోశాధికారి పిల్లి రమేష్, భీమక్త అశోక్, బాబాగౌడ్, నర్సింహ్మా, జగదీష్ తదితరులున్నారు.

వినూత్న ఆవిష్కరణలవైపు అడుగులు వేయాలి


మాట్లాడుతున్న రావుల శ్రీధర్‌రెడ్డి

కవాడిగూడ: విద్యార్థులు ముందుచూపుతో ఆలోచించి వినూత్న అంశాలను ఆవిష్కరించే దిశగా పయనించాలని తెలంగాణ ఎడ్యుకేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎంచుకున్న రంగాల్లో రాణించి వారితో పాటు దేశ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సోమవారం దోమలగూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో వాసవీ పబ్లిక్ స్కూల్ 2023-24 విద్యా సంవత్సరం నూతన విద్యార్థి నాయక మండలి ప్రమాణస్వీకారోత్సవాన్ని స్కూల్ ప్రిన్సిపల్ జయశ్రీరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో శాస్త్రవేత్తలు, వాణిజ్యవేత్తలుగా ఎదగాలన్నారు. వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, కో- ఆర్డినేటర్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.